క్లుప్తంగా

ఘనంగా నంగాలమ్మ వారి ఊరేగింపు



నంగాలమ్మ వారి ఊరేగింపులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, స్థానికులు

నిడదవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిడదవోలు గ్రామదేవత నంగాలమ్మ వారి ఊరేగింపును బుధవారం యాదవుల వీధిలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, యాదవ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు గోపీయాదవ్, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రే పార్వతిలు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడపా ఏడుకొండలు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కొవ్వూరు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సుశీల బుధవారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీలకు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే నిమిత్తం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్య దర్శులకు వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ అందించనున్నట్టు ఎంపీడీవో వివరించారు.

చాగల్లులో నేడు, రేపు

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18, 19వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో నిర్మలకుమారి తెలిపారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈ శిక్షణ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని నిర్మలకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య సురక్షలో 413 మందికి వైద్యం



నిడదవోలులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజశ్రీ, వైద్య సిబ్బంది

నిడదవోలు: స్థానిక టక్కర్ బాబా వార్డు సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరంలో 413 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నెహ్రూ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఇ.తేజశ్రీ నేతృత్వంలో ముగ్గురు వైద్యుల బృందం పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో పురుషులు 183, మహిళలు 220, విద్యార్థులు ఆరుగురు, గర్భిణులు నలుగురికి వైద్యం చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వార్డు కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి కోటేశ్వరరావు, పాలా కిరణ్, గంగుల గోపీ యాదవ్ వైద్యశిబిరాన్ని పరిశీలించి రోగులను అందుతున్న సేవలపై ఆరా తీశారు. .

పాలంగిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



సంకల్పయాత్రలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉండ్రాజవరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు కె.సత్యనారాయణ కోరారు. మండలంలో పాలంగి సచివాలయం వద్ద బుధవారం సర్పంచ్ బొక్క శ్రీనివాసు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. సభలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ప్రసంగాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్‌కే రాజు, ఈవోపీఆర్డీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, పాలాటి శరత్‌బాబు, సచివాలయ కార్యదర్శి హసన్ జానీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం కె.సావరంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ అధ్యక్షతన వికసిత సంకల్ప యాత్ర గ్రామ సభ నిర్వహించారు.

మెట్టలో ముమ్మరంగా వరి నాట్లు

- సాధారణ సాగు విస్తీర్ణం 34,943 హెక్టార్లు
- ఇప్పటికే 10772 హెక్టార్లలో నాట్లు
- నీటి ఎద్దడి వల్ల కొంత ఆలస్యం



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో రబీ వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ముగియడంతో రబీ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా బోర్ల క్రింద వరి పంట పండిస్తున్నారు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల దిగుబడులు సాధించి గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడంతో గత రెండేళ్లుగా గిట్టుబాటు ధర పొందుతున్నారు. దీంతో వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

తొమ్మిది మండలాల్లో..

కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో రబీలో 34943 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. డిసెంబరులో నాట్లు ప్రారంభించగా, ఇప్పటి వరకూ 10, 772 హెక్టార్లలో నాట్లు వేసినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. నీటి సమస్య ఉండడంతో నాట్లు ఆలస్యంగా వేస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారం నాటిని దాదాపు నాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. బోర్ల క్రింద వరి నారుమడులు వేసి సిద్ధం చేశారు. మండలాల వారీగా వరి సాధారణ సాగు విస్తీర్ణం, ఇప్పటి వరకూ వేసిన నాట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	వేసిన నాట్లు (హెక్టార్లలో)
కొవ్వూరు	4649	1563
చాగల్లు	3459	844
తాళ్లపూడి	3491	620
గోపాలపురం	1874	1641
దేవరపల్లి	2771	801
ఉండ్రాజవరం	5017	796
పెరవలి	3545	987
నిడదవోలు	7389	2312
నల్లజర్ల	2748	1205

ఇప్పటి వరకూ బోర్ల కింద



కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో రబీ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బోర్ల క్రింద ఇప్పటి వరకూ నాట్లు వేశారు. అవసరమైన నారు సిద్ధంగా ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల నాట్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 34943 హెకార్లు కాగా, ఇప్పటి వరకూ 10,772 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. మరో నెల రోజుల్లో నూరు శాతం నాట్లు పూర్తవుతాయి. రబీలో వేసిన పంటలకు ఈ– పంట నమోదు ప్రారంభిస్తున్నాం. రైతులు తప్పని సరిగా ఈ పంటను నమోదు చేయించుకోవాలి.

– చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పూజలు



నారసింహునికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగాల నాయకుడు బద్రి

ద్వారకాతిరుమల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నిక కావాలని ప్రార్థిస్తూ మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీ నరసింహ స్వామివారికి కొవ్వూరు మండలం కుమారదేవానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకుడు పసుపులేటి వీరభద్రరావు(బద్రి) బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజాదికాలను జరుపుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నారసింహుడు తన ఇష్ట దూవమన్నారు. భక్తులు స్వామివారికి నైవేద్యంగా సమర్పించే పాల పొంగళ్లను వండే షెడ్లను తాను నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్వామివారికి పూజలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, కరాటం చినరాయుడు, శాసనాల రాజేష్, పుప్పాల పుండరీకాక్ష తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రాజమహేంద్రవరం జట్టు



క్రికెట్ పోటీలలో విజేతల జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వైఎస్ ఆర్మీ పేరుతో కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గత 10రోజులుగా నిర్వహిస్తున్న వైఎస్ ఆర్మీ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. టోర్నీ విజేత అయిన రాజమహేంద్రవరం జట్టుకు రూ.50 వేల నగదు బహుమతిని, షీల్డ్‌ను రాజమహేంద్రవరం ఫస్ట్ ప్లస్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బొమ్మారెడ్డి కళాధర్‌రెడ్డి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పెనకనమెట్ట జట్టుకు రూ.25 వేల నగదు బహుమతిని వైఎస్ ఆర్మీ సభ్యుల సహకారంతో అందజేశారు.

టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ తాము రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి, జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కానీ గత 14 ఏళ్లుగా వైఎస్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్ రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, సర్పంచ్ పైడి శిరీష, వైఎస్ ఆర్మీ సభ్యులు గణేష్, మోహన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీరామ్ పాల్గొన్నారు.

ముగిసిన భావనారుషి ఉత్సవాలు

గ్రామోత్సవంలో ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు



తాళ్లపూడిలో భావనా రుషి గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు

తాళ్లపూడి: పద్మశాలీల ఆరాధ్య దైవమైన తాళ్లపూడిలోని భద్రావతీ సమేత భావనా రుషి ఉత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం భావనారుషి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ప్రభలు, శూలాలు, బుట్టబొమ్మలు, కోబ్రా, కోయ నృత్యాలు, కాళికామాత, చిత్ర విచిత్ర వేషధారణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కేరళ వాయిద్యాలు, డ్యాన్స్, తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా కాల్పులతో ప్రభల సంబరం ఘనంగా నిర్వహించారు. వాటిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నక్కా చిట్టిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోదాటి సత్యనారాయణ, ఉడతా వీరేంద్ర, అధిక సంఖ్యలో పద్మశాలీలు, పాల్గొన్నారు. తాళ్లపూడి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శూలాలతో ప్రభల సంబరంలో గ్రామస్తులు



ఆకట్టుకున్న కేరళ వాయిద్యాల ప్రదర్శన

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలి రావాలి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



దేవరపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణకు గోపాలపురం నియోజకవర్గం నుంచి ఎస్సీ, బీసీలు భారీ ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాశిల్పా (అంబేడ్కర్ విగ్రహం)న్ని ఈ నెల 19వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 1,000 మంది బడుగు, బలహీనవర్గాల వారిని సమీకరణ చేస్తున్నట్టు చెప్పారు. 20 బస్సులను ఏర్పాటు చేసి ప్రజలను కార్యక్రమానికి తరలిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

19న శ్రీరామ విజయ యాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యగోపీనాథ్ దాస్ ప్రభుజీ తదితరులు

సీటీఆర్ఐ: అయోధ్యలోని రామ మందిరంలో ఈ నెల 22న ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో 19న స్థానిక ఏవీ అప్పారావు రోడ్డు నుంచి శ్రీరామ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్టు బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపీనాథ్ దాస్ ప్రభుజీ అన్నారు. ఆల్కాట్ గార్డెన్స్ వరకూ యాత్ర కొనసాగుతుందన్నారు. స్థానిక సరస్వతీ ఘాట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19న మధ్యాహ్నం రెండు గంటలకు ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి యాత్ర ప్రారంభమై, దానవాయిపేట, నందం గనిరాజు జంక్షన్, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా ఆల్కాట్ గార్డెన్స్‌లోని గేదెల నూకరాజు కల్యాణ మండపం వరకూ యాత్ర కొనసాగుతుందని వివరించారు. అయోధ్యలో రామాలయం పూర్తయి, ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో రాజమహేంద్రవరంలో ఈ యాత్ర తలపెట్టినట్టు చెప్పారు. వివిధ వేషధారణలు, కోలాటం, హరిదాసులు, రామనామ సంకీర్తన చేసుకుంటూ యాత్ర సాగుతుందన్నారు. శ్రీరామ లీలలను వివరిస్తూ, పది వాహనాలు యాత్రలో ఉంటాయన్నారు.

ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితం

కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్

ఫిబ్రవరి 14 వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవం

కొవ్వూరు: ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉందని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమనే నమ్మకాన్ని ప్రయాణికుల్లో పెంపొందించాలని ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా బుధవారం కొవ్వూరు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో కండక్టర్లు కూడా తమ వంతు తోడ్పాటు అందించాలని సూచించారు. గ్యారేజీ సిబ్బంది మంచి టూల్స్ వాడకం, మెరుగైన నిర్వహణ ద్వారా బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా సహకరించాలని కోరారు. డ్రైవర్లు డ్రైవింగ్ నైపుణ్యతను పెంచుకుంటూ ప్రమాద రహిత ప్రయాణాలకు సహకరించాలని కోరారు. డ్రైవింగ్‌లో ఉన్నపుడు మత్తు పానీయాల జోలికి వెళ్లవద్దని ఆయన డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏటా వారికి వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రక్రియలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా ఈ నెల 15 నుంచి వచ్చే 14 వరకూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

శ్రీవారి ఆలయానికి రూ.7 లక్షల విరాళం



దాత తీగెల బలరామయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. దేవరపల్లికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా నాయకుడు తీగెల బలరామయ్య ఆలయం ప్రాంగణంలో టైల్స్ వేయడానికి రూ.7 లక్షల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బలరామయ్యను ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు సుంకర సుబ్రహ్మణ్యం, గుడ్ల వెంకటేశ్వరరావు, చిట్లు వెంకటేశ్వరరావు, యాగంటి శ్రీనివాస్ ఘనంగా సత్కరించి స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

జగన్నాథపురంలో రాములోరి తలంబ్రాలు




ధాన్యం ప్యాకెట్లను భజన మండలి సభ్యులకు అందజేస్తున్న వెదుళ్ల రామకృష్ణ

నల్లజర్ల: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణానికి గోటితో వలిచే తలంబ్రాల కోసం 100 కిలోల ధాన్యాన్ని మండలంలోని జగన్నాథపురం శ్రీసీతారామ భజన మండలి సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ ధాన్యాన్ని జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీరామా ఆధ్యాత్మిక సేవాసమితి కమిటీ కార్యదర్శి వెదుళ్ల రామకృష్ణ దంపతులు ఇక్కడి భజన మండలికి అందజేశారు. ఒక్కో ప్యాకెట్ 100 గ్రాములు. వాటిని తరతమ భేదం లేకుండా మండలంలో వివిధ భజన మండలులకు అందజేసి అత్యంత భక్తి శ్రద్ధలతో గోటితో ఒలిచే కార్యక్రమం చేపడతారు. ఒలిచిన ధాన్యాన్ని మార్చి నెలలో భద్రాచలంలో దేవస్థానానికి అందజేస్తామని భజనమండలి సభ్యులు మైనం వెంకట బ్రహ్మయ్య, సవలం రామకృష్ణ తెలిపారు.

22న రాష్ట్రంలో సెలవు ప్రకటించాలి

తాళ్లూరు మఠం పీఠాధిపతి ప్రసాద్ ఆచార్యులు



ప్రసాద్ ఆచార్యులు

నల్లజర్ల: అయోధ్యలో నూతనంగా నిర్మిస్తున్న రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించే ఈనెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సెలవు దినంగా ప్రకటించాలని శ్రీపరవస్తు అఝుమయ మణవాళ మణవాళ జియ్యర్ స్వామి మఠాధిపతి, వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ (తాళ్లూరు మఠం) ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం వెళ్తూ మార్గ మధ్యలో మండలంలోని అనంతపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశామన్నారు. 122 దేశాల ప్రతినిధులు 22న అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపనకు హాజరవుతున్నారని, అంతటి పవిత్ర మైన రోజున సెలవు ప్రకటించడం సముచితంగా ఉంటుందన్నారు.

వాలీబాల్ నియోజకవర్గ స్థాయి పోటీలకు పోచవరం జట్టు



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన పోచవరం జట్టును అభినంధిస్తున్న కాకర్ల వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ పోటీల్లో పోచవరం జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ జట్టు త్వరలో నిర్వహించే కొవ్వూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. వేగేశ్వరపురంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ పోటీల్లో పోచవరం జట్టు సత్తా చాటి ఫైనల్‌కు చేరిందని వ్యాయామోపాధ్యాయుడు అనిల్ తెలిపారు. ఈ జట్టులో చీలి కిరణ్, పిల్లి కాశీ, యువరాజ్ కుమార్, ఎం.తేజ, వి.సుధీర్, కె.బెన్నీలు సభ్యులు. వారిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు అభినందించారు.

పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సందడి



ఊనగట్ల జెడ్పీ హైస్కూల్ 1982-87 బ్యాచ్ విద్యార్థులు



వాదాలకుంట జెడ్పీ హైస్కూల్ 2005-06 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

చాగల్లు: మండలంలోని ఊనగట్ల జెడ్పీ హైస్కూల్ 1982–87 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆ పాఠశాలలో బుధవారం కోలాహలంగా జరిగింది. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను చిన్ననాటి మిత్రులతో పంచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో స్థిరపడినందుకు గర్వంగా ఉందన్నారు. సుమారు 50 మంది విద్యార్థులు తమ కుటుంబాలతో సహా ఈ సమ్మేళనంలో పాల్గొని అప్పుడు పనిచేసిన ఉపాధ్యాయులు జి.ఆచార్యులు, గోపాలకృష్ణంరాజులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, కలవలపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ముళ్లపూడి గంగా భవాని, ఎల్.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, కె.లక్ష్మీనారాయణ, మెరిపో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం మండలం వాదాలకుంటలో..

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట జెడ్పీ హైస్కూల్ 2005–06 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల బుధవారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న తరగతి గదుల్లోను, పరిసర ప్రాంతాల్లో సంచరించి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.